క్లుప్తంగా

హైకోర్టు ఏజీపీకి సన్మానం



హైకోర్టు ఏజీపీ పూల్‌సింగ్‌నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన సమాఖ్య నాయకులు

అర్వపల్లి : రవాణా, రోడ్లు భవనాల శాఖకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా నియమితులైన రామన్నగూడెంతండాకు చెందిన రమావత్ పూల్‌సింగ్‌నాయక్‌ను శుక్రవారం అర్వపల్లిలో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజారాం, ఉపాధ్యక్షుడు ప్రతాప్, మాజీ ఎంపీటీసీ, గిరిజన సంస్కృతి రాష్ట్ర కమిటీ సభ్యుడు రమావత్ శంకర్‌నాయక్, న్యాయవాది రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

తిరుమలగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 10వ వార్డు కౌన్సిలర్ మొగుళ్ల జితేందర్ కోరారు. గురువారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వార్డులో ఇంటింటికీ తిరుగుతూ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



వెలుగుతున్న వీధిలైటు

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : వీధిలైట్లు వెలగక అంధకారం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని వీధులలో కొత్తగా వీధిలైట్లు ఏర్పాటు చేసి వెలిగించారు. దీంతో కొద్దిరోజులుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలిగాయి.

పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

అర్వపల్లి : పాస్టర్స్ ఫెలోషిప్ తుంగతుర్తి నియోజకవర్గ సమావేశాన్ని శుక్రవారం కోమటిపల్లి గ్రామ పరిశుద్ధ ప్రార్థన మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ కమిటీ సహాయ కార్యదర్శిగా కొప్పుల ఏసుపాదంను ఎనుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మందుల బాబూరావు, ఉపాధ్యక్షుడు బాకి సుధీర్, కార్యదర్శి రమేష్, పరంజోతి, సిమోను, ఆనోక్, రవి, లాజర్, శ్యామ్, ఇజ్రాయిల్, ప్రవీణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోమటిపల్లిలో ఇంద్రకంటి ముత్యాలమ్మ ఆలయం చుట్టూ కంపచెట్లు పెరిగి ఆలయ పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నున్న యాదగిరియాదవ్ శుక్రవారం స్వచ్ఛందంగా జేసీబీని ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించే పనులు చేయించారు. అలాగే ఆలయం చుట్టూ శుభ్రం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సొంత ఖర్చులతో శుభ్రం చేయించినట్లు యాదగిరి తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన సాయిని ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి శుక్రవారం మృతురాలి కుటుంబీకులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, బద్రి, సందీప్, ఉమ్మయ్య, మధు తదితరులు ఉన్నారు.



అర్వపల్లిలో ముత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనోకార్పస్.. ఆరోగ్యానికి హానికరం

- పల్లె ప్రకృతివనాలు, వననర్సరీలు, పబ్లిక్ ప్రదేశాలలో కోనోకార్పస్ మొక్కలు
- శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలుపుతున్న నిపుణులు



అర్వపల్లిలో పెరుగుతున్న కోనోకార్పస్ చెట్లు



రామన్నగూడెంలో..

అర్వపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా కోనోకార్పస్ మొక్కలను పెంచారు. రహదారుల వెంట, గార్డెనింగ్, కమ్యూనిటీ, అవెన్యూ ప్లాంటేషన్‌లలో ఈ మొక్కలను పెద్ద సంఖ్యలో నాటారు. అయితే వీటితో అనారోగ్య సమస్యలు వస్తాయని వృక్ష, పర్యావరణ నిపుణులు తెలుపుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ కోనోకార్పస్ మొక్కలను పెంచుతున్నారు. అర్వపల్లితోపాటు పలు గ్రామాల్లో ఈ మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. ఈ మొక్కల వల్ల పచ్చదనం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని వృక్ష, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. పక్షులు కూడా వీటిపై వాలడంలేదు. వీటిని ఏ పశువులు తినడం లేదు. అన్ని చోట్ల ఈ మొక్కలు ఆరు ఫీట్ల ఎత్తుకు పైగానే పెరిగాయి. వీటికి ప్రస్తుతం పూతతోపాటు, కాయలు కూడా కాచాయి. ఈ చెట్ల నుంచి వచ్చే వాసనతో మనుషులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని వృక్ష, పర్యావరణ నిపుణులు తెలుపుతున్నారు.

హానికరమని తెలిసినా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు, సంపద వనాలు, వననర్సరీలు, శ్మశానవాటికలలో ఈ మొక్కలను పెంచారు. ఈ మొక్కలను పెంచవద్దని, తొలగించాలని గత ప్రభుత్వ హయాంలో లిఖిత పూర్వకంగా ఆదేశాలిచ్చారు. కానీ అన్ని చోట్ల ఈ మొక్కలు అలాగే ఉన్నాయి. వీటి తొలగింపుపై అప్పటి నుంచి పెద్దగా దృష్టి సారించలేదు. ఇప్పటికైనా కోనోకార్పస్ మొక్కలను తొలగించి మంచి గాలినిచ్చే ఆరోగ్యకరమైన మొక్కలను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచాలి



కోనోకార్పస్ మొక్కలు మానవుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. వీటితో ప్రజలు అస్తమా, ఉబ్బసం, వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పల్లె ప్రకృతివనాలు, రోడ్ల వెంట పెంచుతున్న ఈ మొక్కలను వెంటనే తొలగించాలి. పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచాలి.

– దడిపల్లి వెంకట్, సామాజిక కార్యకర్త

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి



మా రామన్నగూడెంలోని పల్లె ప్రకృతివనం, రైతు వేదిక, వననర్సరీల ప్రదేశాల్లో గతంలో నాటిన కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలి. ఈ మొక్కల వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఈ మొక్కలను గతంలో తెలంగాణకు హరితహారంలో నాటారు. వాటిని తొలగించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

– వజ్జె సాయి, రామన్నగూడెం

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏఈఓ ముత్తయ్య

సూర్యాపేట రూరల్ : ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసినట్లయితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య అన్నారు. కేసారం గ్రామంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపైన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోట నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నందున ముత్తయ్యను రైతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, క్షేత్ర సహాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో అర్వపల్లిలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని, 60ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.10వేల పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం.లింగయ్య, ఉపాధ్యక్షుడు ఎ.మురళి, రామయ్య, కృష్ణ, జమ్లా, నాని, రాజయ్య, జహంగీర్, అమర్‌సింగ్, రాంమూర్తి, లాలు, సుమన్, నారాయణ, నాగరాజు, సైదులు, వీరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తే ఉద్యమాలు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



మాట్లాడుతున్న గుమ్మడి నరసయ్య

భానుపురి : సూర్యాపేటలోని సర్వే నంబర్ 126 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలను ఇబ్బందులకు గురిచేస్తే ఉద్యమాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని లెనిన్ నగర్‌లో గుడిసెలు వేసుకున్న ప్రజలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు సంవత్సరాలుగా నిలువ నీడలేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తూ ఉంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేకసార్లు గుడిసెలను తీయించిందని అన్నారు. పేదలపై, తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించారని తెలిపారు. అయినా పేదలు భయపడకుండా గుడిసెలు వేసుకొని జీవిస్తూ ఉంటే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కిరాయి హంతకులతో కలిసి దాడులు చేశాడని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు, వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్, పేర్ల నాగయ్య, గొడ్డలి నరసయ్య, సూరం రేణుక, హుస్సేన్, వీరబాబు, రాంజీ, వాజీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బస్ డిపో నిర్మించాలి



మాట్లాడుతున్న కడెం లింగయ్య

తిరుమలగిరి : తిరుమలగిరిలో బస్ డిపో నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని బస్ డిపో సాధన సమితి కన్వీనర్ కడెం లింగయ్య కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుమలగిరి మూడు జిల్లాల పరిధిలో ఉంటుందని తెలిపారు. తిరుమలగిరిలో బస్ డిపో నిర్మాణం మండల ప్రజల చిరకాలవాంఛ అని అన్నారు. తిరుమలగిరికి జూనియర్ కళాశాలను మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే మందుల సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండా సోమయ్య, ఎస్.కె.పాషా, ఆకుల ఎల్లయ్య, వేల్పుల లింగయ్య, ఎలుగుల ఎర్రయ్య, రమేష్, మూల వెంకట్‌రెడ్డి, అశోక్, లింగయ్య పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణ పనులు ప్రారంభం



కొనసాగుతున్న కళావేదిక పనులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన కళావేదిక నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ దశలో పనులు జరుగుతున్నాయి. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సుమారు రూ.3లక్షలతో కళావేదికను నిర్మిస్తున్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి మరో రూ.8లక్షల నిధిని ఏర్పాటు చేసినట్లు కళావేదిక నిర్మాణ నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు రత్నం లక్ష్మాజి, మారం లింగారెడ్డి, గంగ నాగార్జునరెడ్డి, సార్ల వెంకన్న, జీడి భిక్షం, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తాము చదువుకున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అవసరమైన పనులు చేపడుతామని చెప్పారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



అర్వపల్లి : పత్తిచేనులో సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు



గాజులమల్కాపురంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం కొమ్మాల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పత్తిచేనులో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, నాయకులు కుక్కడపు సైదులు, గంగదెరి శ్రీనివాస్, రామిడి వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, శిగ రంజిత్, సైదులు, వీరేష్, వెంకటయ్య, గంగయ్య, గోపాల్, కరుణాకర్‌రెడ్డి, శ్రీరాములు, రాకేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సమ్మక్క–సారలమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బండి మధుసూదన్‌రెడ్డి, దొంతగాని పాపయ్య, బెల్లంకొండ శ్రీరాములు, బండి శ్రీరాంరెడ్డి, గొబ్బి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే

మునగాల : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మునగాల మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టినట్లు ఎంపీడీఓ కె.రమేష్‌దీన్‌దయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో వైద్యారోగ్య శాఖ, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. పలు ఇళ్లలో నీటి నిల్వలను తొలగించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.చంద్రశేఖర్, ఆశా వర్కర్లు, వైద్యారోగ్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



తుంగతుర్తి : అన్నారంలోని రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



తుంగతుర్తిలో పూజలు చేస్తున్న మహిళలు

ఆత్మకూరు (ఎస్) : నెమ్మికల్‌లోని శ్రీ సీతా రామాలయంలో మహిళలు శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు గణపతి పూజ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. దండు మైసమ్మ ఆలయం, ఏపూరులోని రామాలయం, పాతర్లపహాడ్‌లోని రామాలయం, మిద్దనపల్లిలోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా జరిపారు. కొందరు మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ధర్మజాగరణ సమితి సభ్యులు ఝాన్సీ, రాష్ట్రీయ సేవి కాసమితి సభ్యులు సునీత, కవిత, అంజమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం వేడుకలను భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో, ఇళ్లలో మంగళ గౌరీవ్రతం, తదితర ప్రత్యేక పూజలు చేశారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, కొమ్మాలలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబు అయ్యంగార్, పవన్‌కుమార్, దదూరి జగన్నాథచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



నెమ్మికల్‌లో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



అర్వపల్లి : కొమ్మాలలోని వేణుగోపాల స్వామి ఆలయంలో..

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగారం : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారం మండలం పేరబోయినగూడెం సమీపంలోని బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గ్రామ శివారులో పట్టుకొని సీజ్‌చేశారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐతో పాటు ఏఎస్‌ఐ వెంకట్రాములు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

మునగాల : జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికై 78వ స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న తహసీల్దార్ వి.ఆంజనేయులు, రేపాల పీహెచ్‌సీ ఏఎన్‌ఎం మిట్టగణుపుల నర్సమ్మను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సామాజిక కార్యకర్త గంధం సైదులు, ఆర్‌ఐలు రామారావు, అజయ్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి

నూతనకల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కళాశాల, పాఠశాలల్లో చదివే విద్యార్థులు మత్తుమందులను వినియోగిస్తున్న వారిని కనిపెట్టి పోలీసు శాఖకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్‌లు బహిర్గతం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేంద్రనాథ్, పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, ఎల్లయ్య, గోపయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్ నాయక్

డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన



మద్దిరాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దిరాల : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల సమీపంలో డంపింగ్ యార్డు ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విషయాన్ని విద్యార్థులు ఇటీవల అధికారులకు తెలిపారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ అమిన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డిలు మండల కేంద్రంలోని మరో ప్రభుత్వ స్థలాన్ని డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. కస్తూరిబా పాఠశాల సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను మండల కేంద్రంలోని మరో ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి, ఆర్‌ఐ వహీద్, ఏపీఓ గుండు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు నో కరెంట్ బిల్!

- ప్రభుత్వ నిర్ణయంతో మేలు
- నిర్వహణ నిధులు ఇతర పనులకు వాడుకునే వెసులుబాటు



అనాజిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పెన్‌పహాడ్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఉచిత విద్యుత్ ప్రభుత్వ పాఠశాలలకు కూడా వర్తిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బడుల నిర్వహణకు వచ్చే నిధులు ఎక్కువగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకే సరిపోతుంటాయి. ఒక్కోసారి నిధులు సమయానికి రాకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. దీంతో బకాయిలు పేరుకుపోయి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక నుంచి ఉచిత విద్యుత్‌తో ఎలాంటి ఇబ్బందులు ఉండవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొద్దిపాటి నిధులు..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.10వేల నుంచి రూ.75వేల వరకు చెల్లిస్తుంది. అయితే ప్రాథమిక పాఠశాలలకు రూ.25వేల వరకు వస్తుంటాయి. ఇవి కూడా రెండు దఫాలుగా చెల్లిస్తుండడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడేవారు. వీటితోనే స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, ఇంటర్‌నెట్ బిల్లులు, చిన్న చిన్న మరమ్మతులు, కంప్యూటర్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, తాగునీటి నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రకటించిన ఉచిత విద్యుత్ వల్ల కొన్ని నిధులను అభివృద్ధి పనులకు ఉపయోగించుకునే అవకాశం ఏర్పడింది.


వినియోగం ఎక్కువే..

మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత, 8 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటికి కేటగిరి 7ఏ కింద విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ప్రాథమిక బడులకు ప్రతి నెలా సుమారు రూ.300, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.500 బిల్లులు వస్తుంటాయి. ఇక ఉన్నత పాఠశాలలకు పది తరగతి గదులు, వరండాలు ఉంటాయి. వీటన్నింటికీ బల్బులు, ఫ్యాన్లు ఉంటాయి. దీనికి తోడు బోరు ఉంటుంది. దీనికి నెలకు రూ.800వరకు బిల్లు వస్తుంది. ఈ బిల్లుల నుంచి ఉపశమనం లభించడంలో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొన్నేళ్లుగా డిమాండ్..

పాఠశాలలకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్ అందించాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. ఉపాధ్యాయ సంఘాలు ఎన్నోసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చాయి. అయినా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించడం సరైన నిర్ణయం అని ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

ఇతర అవసరాలకు వినియోగం



ప్రభుత్వ నిర్ణయంతో బడుల ఆర్థిక భారం తగ్గనుంది. కరెంటు బిల్లుల చెల్లింపు లేకపోవడంతో కొంత సొమ్ము మిగులుతుంది. నిర్వహణ నిధులను ఇతర అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుంది.

– వస్రాం నాయక్, హెచ్ఎం, అనాజిపురం